ముమ్మరంగా రోడ్డు విస్తరణ పనులు

- గరిడేపల్లి నుంచి అలింగాపురం వరకు డబుల్‌ రోడ్డు నిర్మాణం
- మంత్రి ఉత్తమ్‌ కృషితో సీఆర్‌ఎఫ్‌ నుంచి రూ.30కోట్ల నిధులు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు




కొనసాగుతున్న గరిడేపల్లి- అలింగాపురం రోడ్డు వెడల్పు పనులు

గరిడేపల్లి : మండల కేంద్రం నుంచి అలింగాపురం గ్రామం వరకు సింగిల్‌ రోడ్డుగా ఉన్న రహదారిని డబుల్‌ రోడ్డుగా విస్తరించే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా అధ్వానంగా మారిన ఈ రహదారి నిర్మాణానికి ఇరిగేషన్‌, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఇప్పటికి డబుల్‌రోడ్డు నిర్మాణానికి మోక్షం కలిగింది. సీఆర్‌ఎఫ్‌ (సెంట్రల్‌ రోడ్డు ఫండ్‌) నుంచి మంత్రి ఉత్తమ్‌ రూ.30కోట్ల నిధులు మంజూరు చేయించడంతో పనులు జరుగుతున్నాయి. గతంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా ఉన్న సమయంలో కూడా ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి సింగిల్‌ రోడ్డు నిర్మాణం చేపట్టారు. తిరిగి కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రస్తుతం ఆయన ప్రత్యేక చొరవ తీసుకొని గ్రామస్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నిధులు మంజూరు చేయించారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 15 కిలోమీటర్ల పొడవు గల ఈ రోడ్డును 33అడుగుల వెడల్పుతో నిర్మిస్తున్నారు. గరిడేపల్లి నుంచి అలింగాపురం క్రాస్‌రోడ్డు వరకు డబుల్‌ రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. ఇప్పటికే వెడల్పు పనులు కూడా పూర్తికావచ్చాయి. 42చోట్ల కల్వర్టుల నిర్మాణం కూడా పూర్తి చేశారు. 18నెలల వ్యవధిలో రోడ్డు నిర్మాణం పూర్తవుతుందని అధికారులు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణంతో గరిడేపల్లి, గారకుంట తండా, చంద్రయ్యగూడెం, గంగానగర్‌, కల్మలచెరువు, అలింగాపురం వెళ్లే గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తొలగనున్నాయి. గరిడేపల్లి నుంచి జాన్‌పహాడ్‌ వెళ్లే భక్తులు ఈ రోడ్డులో వెళ్తే దూరభారం తగ్గనుంది. రోడ్డు నిర్మాణ పనులు సాగుతుండడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి చొరవతో నిధులు మంజూరు



రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవే కారణం. గతంలో నిధులు మంజూరు చేయించి బీటీరోడ్డు నిర్మించిన ఘనత ఉత్తమ్‌కే దక్కింది. మళ్లీ మా కష్టాలను దృష్టిలో ఉంచుకొని రూ.30కోట్ల మంజూరు చేయించడం రోడ్డు పనులు ప్రారంభించడం సంతోషకరం. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మేలును ఎప్పటికీ మరువలేం.

– మూలగుండ్ల సీతారాంరెడ్డి, కాంగ్రెస్‌ మండల వర్కింగ్‌ ప్రెసిడెంట్‌

క్లుప్తంగా

రోడ్డుపై ప్రవహిస్తున్న సాగునీరు



పాలకవీడు శివారులో రహదారిపై ప్రవహిస్తున్న నీరు

పాలకవీడు : మండల కేంద్రం నుంచి నేరేడుచర్ల వెళ్లే ప్రధాన రహదారిపై పాలకవీడు గ్రామ శివారులో కొన్ని రోజులుగా సాగునీరు రోడ్డుపై ప్రవహిస్తుంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిపై ప్రతి రోజు అధికారులు ప్రయాణిస్తున్నా పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సిమెంట్‌ లోడ్‌తో వెళ్లే భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు ధ్వంసం అవుతుందని, నష్టం జరగకముందే రోడ్డుపై ప్రవహించే నీటిని మళ్లించి తగిన చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

వేనేపల్లి వెంకటేశ్వరరావుకు సీపీఐ నాయకుల పరామర్శ



వెంకటేశ్వరరావు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న సీపీఐ నాయకులు

చిలుకూరు : మండల పరిధిలోని కొండాపురం గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్‌ నాయకుడు వేనేపల్లి వెంకటేశ్వరరావు ఇటీవల అనారోగ్యానికి గురై ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆదివారం ఆయనను సీపీఐ నాయకులు కలిసి పరామర్శించారు. అనంతరం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కలిసిన వారిలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్‌, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

ఎస్సారెస్పీ జలాల రాకతో రైతుల హర్షం



ఎస్సారెస్పీ కాల్వలో ప్రవహిస్తున్న జలాలకు పూజలు చేస్తున్న రైతులు

మోతె : మండలానికి ఎస్సారెస్పీ జలాలు చేరుకోవడంతో రైతులు ఆదివారం గంగమ్మతల్లికి కుంకుమ, పసుపు చల్లి కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఎస్సారెస్పీ జలాలు రాకతో రైతుల ముఖాల్లో ఆశలు చిగురించాయి. వానాకాలం సీజన్‌లో మండలానికి తప్పకుండా ఎస్సారెస్పీ జలాల వస్తాయనే నమ్మకంతో రైతులు ముందస్తు వరిపంటలు సాగు చేశారని కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌ పేర్కొన్నారు. జలాలకు పూజా కార్యక్రమంలో రైతులు, కాంగ్రెస్‌ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు



వెంకటేశ్వర్లు

గరిడేపల్లి : మండల పరిధిలోని గడ్డిపల్లి గ్రామానికి చెందిన మేకల వెంకటేశ్వర్లు బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా ఆదివారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా మేకల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. హుజూర్‌నగర్‌ పట్టణంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి సమక్షంలో నియామకం చేసినట్లు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఆయిల్‌పామ్‌ సాగుతో అధిక లాభాలు

నాగారం : నీటి వసతి ఉన్న రైతులు ఆయిల్‌పామ్‌ తోటలను సాగు చేసి అధిక లాభాలు పొందవచ్చని పతంజలి తుంగతుర్తి డివిజన్‌ ఫీల్డ్‌ ఆఫీసర్‌ పి.అశోక్‌ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయిల్‌పామ్‌ మేఘ ప్లాంటేషన్‌ డ్రైవ్‌లో భాగంగా రైతు కడారి నర్సింహారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో నూతనంగా ఆయిల్‌పామ్‌ మొక్కలను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడారు. మార్కెట్‌లో మంచి డిమాండ్‌ ఉన్న ఆయిల్‌పామ్‌ తోటల సాగుపై రైతులు దృష్టి సారిస్తే ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని అన్నారు. ఆయిల్‌పామ్‌ తోటలు సాగు చేయాలనుకున్న ఆసక్తి గల రైతులు ఉద్యాన శాఖ అధికారులకు దరఖాస్తు చేయలని కోరారు. ఈ కార్యక్రమంలో పతంజలి క్షేత్ర సహాయకులు రంగు ముత్యం రాజు, రైతులు నరేష్‌రెడ్డి, కడారి సరళ, రమేష్‌, గణేష్‌ పాల్గొన్నారు.

మహిళల హక్కుల సాధనకు పోరాటం

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

మునగాల : మహిళల హక్కుల సాధనకు ఐద్వా నిర్విరామంగా పోరాడుతుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అమరవీరుల స్మారక భవనంలో నిర్వహించిన ఐద్వా మూడో మండల మహాసభలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐద్వా మూడు లక్షల సభ్యత్వాలు కలిగి ఉందన్నారు. అన్ని జిల్లాలలో స్త్రీలపై సమాజంలో పెరుగుతున్న హింస, అసమానతలు, వివక్షలకు వ్యతిరేకంగా సంఘం అనేక పోరాటాలు చేస్తుందన్నారు. పోరాటాలు చేసి సాధించుకున్న 498ఏ సెక్షన్‌, ఆస్తి హక్కు, జాతీయ, రాష్ట్ర మహిళా కమిషన్‌, స్థానిక సంస్థల రిజర్వేషన్‌లు సాధించడంలో ఐద్వా పాత్ర కీలకమన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎలుగూరి జ్యోతి, కార్యదర్శి మేకబోయిన సైదమ్మ, దేశిరెడ్డి జ్యోతి, నాగేశ్వరమ్మ, ఖాజాబీ, విమల, లింగమ్మ, వెంకటకోటమ్మ, బక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక..

మహాసభల అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలుగా బచ్చలకూరి మంగమ్మ, కార్యదర్శిగా జూలకంటి విజయలక్ష్మి, మరో 16మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఉత్సవాలను విజయవంతం చేయాలి



లోగో విడుదల చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కోదాడరూరల్‌ : అక్టోబర్‌ 24న నిర్వహించే పీడీఎస్‌యూ అర్థశతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆ సంఘం పూర్వ విద్యార్థి రాయపూడి చిన్ని అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎంఎస్‌ కళాశాల ఆవరణలో ఉత్సవాలకు సంబంధించిన లోగోను ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఉస్మానియా యూనివర్సిటీలో మతోన్మాద విద్యార్థి సంఘాలకు వ్యతిరేకంగా పీడీఎస్‌యూ ఉద్భవించిందన్నారు. నాటి నుంచి దేశవ్యాప్తంగా సంఘం విస్తరించి విద్యార్థుల హక్కుల కోసం అనేక ఉద్యమాలు చేసి వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడిందని తెలిపారు. కార్యక్రమంలో ముత్తవరపు పాండురంగారావు, రాఘవరెడ్డి, నాగిరెడ్డి, అప్పిరెడ్డి, రాంబాబు, రామనర్సయ్య, డీఎస్‌ స్వామి, వెంకటేశ్వరరావు, నరసింహారావు, హరికిషన్‌, రంజాన్‌పాషా, భిక్షం, చందర్‌రావు, ఉదయగిరి, కిరణ్‌, సింహాద్రి, నాయకులు తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నేరేడుచర్ల : మండల కేంద్రంలోని ప్రగతి విద్యాలయంలో 2005–2006 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆనాటి మధుర స్మృతులను గుర్తుచేసుకోవడంతో పాటు ఎవరు ఏఏస్థాయిల్లో ఉన్నారో తెలుసుకుని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం నాటి గురువులను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం భాస్కర్‌రెడ్డి, రంగారెడ్డి, పుల్లారెడ్డి, లింగారెడ్డి, రాంరెడ్డి తదితరులున్నారు.

గ్రీన్‌ క్లబ్‌ ట్రస్ట్‌ సేవలను మరింత విస్తరిస్తాం



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న గ్రీన్‌ క్లబ్‌ సభ్యులు

సూర్యాపేట : గ్రీన్‌ క్లబ్‌ ట్రస్ట్‌ సేవలను మరింత విస్తరిస్తామని క్లబ్‌ ట్రస్ట్‌ సూర్యాపేట అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముప్పారపు నరేందర్‌, తోట కిరణ్‌ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బాలాజీ కన్వెన్షన్‌ హాల్‌లో గ్రీన్‌ క్లబ్‌ ట్రస్ట్‌ సూర్యాపేట 8వ వార్షికోత్సవ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలన్నారు. విరివిగా మొక్కలు నాటి సంరక్షిస్తేనే ముందు తరాలకు భవిష్యత్‌ బాగుంటుందని పేర్కొన్నారు. పెరుగుతున్న కాలుష్యానికి విరుగుడు పచ్చదనాన్ని పెంచడమేనని చెప్పారు. వాతావరణ సమతుల్యతను కాపాడాలన్నారు. పుడమికి, పర్యావరణానికి హాని చేసే సింగిల్‌ యూస్డ్‌ ప్లాస్టిక్‌ వాడకాన్ని ఆపివేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ చేతి సంచులను, త్వరగా ప్రకృతిలో కలిసిపోయే వస్తువులనే వినియోగించాలని కోరారు. పుట్టినరోజు, పెళ్లిరోజు వంటి ప్రత్యేక రోజుల్లో మొక్కలను నాటి సంరక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్‌ గౌరవ సలహాదారు న్యాయవాది శశిధర్‌, పీఆర్‌టీ గండూరి కృపాకర్‌, సుధాకర్‌ పీవీసీ అధినేత మీలా మహదేవ్‌, ముప్పారపు నాగేశ్వరరావు, గండూరి ప్రకాష్‌, చల్లా లక్ష్మీకాంత్‌, మిర్యాల వెంకటేశ్వర్లు, ఉప్పల శ్రవణ్‌, లక్ష్మీనారాయణ, యోగా గురువు చాడ పాపిరెడ్డి, భాస్కరాచారి, దేవరశెట్టి నాగరాజు, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'సీడ్స్‌, పెస్టిసైడ్స్‌' యూనియన్‌ డివిజన్‌ అధ్యక్షుడిగా యాదగిరి

తుంగతుర్తి : తుంగతుర్తి డివిజన్‌ సీడ్స్‌, పెస్టిసైడ్స్‌ అండ్‌ ఫర్టిలైజర్స్‌ యూనియన్‌ నూతన కమిటీని ఆదివారం నియోజవర్గ కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫర్టిలైజర్స్‌ యూ నియన్‌ నూతన కమిటీ అధ్యక్షుడిగా పూసపల్లి యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా సోమా వెంకన్న, గౌరవ అధ్యక్షుడిగా గుండా ఈశ్వరయ్య, కోశాధికారిగా సామ నాగిరెడ్డి, ఉపాధ్యక్షులుగా కల్లెట్లపల్లి శ్రీనివాస్‌, మహంకాళి సూర్యనారాయణ, జాయింట్‌ సెక్రటరీగా కాటబత్తిన శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నడిగూడెం : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలతో పాటు మునగాల మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాలలో సహాయ వంట నిర్వాహకులు, స్వీపర్‌, స్కావెంజర్‌ పోస్టులకు ఆయా మండలాల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి ఎండీ.సలీం షరీఫ్‌ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు నేటి నుంచి ఈనెల 25వతేదీ వరకు ఆయా మండల కేంద్రాలలోని విద్యావనరుల కేంద్రంలో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఎం లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహారావు

చిలుకూరు : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీపీఎం పనిచేస్తుందని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జె.నరసింహారావు అన్నారు. ఆదివారం మండలంలోని ఆచార్యులగూడెం గ్రామంలో జరిగిన పార్టీ శాఖా మహాసభలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌ కార్పొరేట్‌ సంస్థలకు ధారదత్తం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. అనంతరం పార్టీ నూతన గ్రామ శాఖ కార్యదర్శిగా గట్టు లింగయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి నాగేటి రాములు, నాయకులు పిల్లి వీరమల్లయ్య, చంద్రయ్య, సురేష్‌, లక్ష్మి, సైదులు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నవీన్‌రెడ్డి కుటుంబానికి పరామర్శ



నవీన్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

మోతె : మండల పరిధిలోని నామవరం గ్రామానికి చెందిన సరసాని నవీన్‌రెడ్డి ఇటీవల అకాల మరణం పొందాడు. ఈ సందర్భంగా అతడి కుటుంబాన్ని ఆదివారం కాంగ్రెస్‌ మండల నాయకులు పరామర్శించారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి మాట్లాడారు. నవీన్‌రెడ్డి కుటుంబానికి కాంగ్రెస్‌ అండగా ఉంటుందన్నారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్‌ కిసాన్‌ సెల్‌ రాష్ట్ర కోఆర్డినేటర్‌ ముదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, పులి ఈదయ్యగౌడ్‌, యూత్‌ కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు వెలుగు వీరన్న, మాజీ సర్పంచ్‌ శ్రీను, తిరుపతినాయక్‌, కార్యకర్తలు ఉన్నారు.

ఉండ్రుగొండలో లక్ష్మీసహస్రనామ పారాయణం

చివ్వెంల : మండల పరిధిలోని ఉండ్రుగొండ శివారులోని శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయం, శ్రీ లక్ష్మీ సమేత హయగ్రీవ ఆలయం, శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయాల్లో ఆదివారం లక్ష్మీ సహస్రనామ పారాయణం నిర్వహించారు. విష్ణు సహస్రనామ పారాయణంను చదివి వినిపించారు. అనంతరం భక్తులు అన్నదానంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాగయ్య, రంగినేని సుధాకర్‌రావు, ప్రసన్న, చంద్రశేఖర్‌, పద్మావతి, ఈగ రామయ్య, పలువురు భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషిచేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బొబ్బా భాగ్యరెడ్డి

హుజూర్‌నగర్‌ : బీజేపీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్‌ పట్టణంలోని వర్తక సంఘం భవనంలో పార్టీ సంస్థాగత, జిల్లా సంయుక్త మోర్చాల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీలో ప్రజలందరూ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. పార్టీలో సభ్యత్వం కలిగి ఉండడం మనకు గర్వకారణమన్నారు. నాయకులందరూ ప్రతి బూత్‌లో వందకి పైగా సభ్యత్వాలు తగ్గకుండా చేయాలని ఆయన సూచించారు. బీజేపీ దేశానికి శ్రీరామ రక్ష అని, నరేంద్రమోదీ ప్రధానమంత్రి అయ్యాక దేశం అన్ని రంగాలలో ముందుకు దూసుకెళ్తుందన్నారు. ప్రతిఒక్కరూ పార్టీకి మద్దతు తెలపడం కోసం 8800002024కు మిస్డ్‌ కాల్‌ ఇచ్చి ఆన్‌లైన్‌లో సభ్యత్వం నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్‌ సభ్యుడు బాల వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకురాలు చల్లా శ్రీలతారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పోకల వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కిరాజు యశ్వంత్‌, అసెంబ్లీ కన్వీనర్‌ అంబళ్ల నరేష్‌గౌడ్‌, కో కన్వీనర్‌ గుండెబోయిన వీరబాబు, నర్సింగ్‌ అంజయ్య, జిల్లా, పట్టణ, మండల నాయకులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర వస్తువుల పంపిణీ



నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న వరప్రసాద్‌రెడ్డి, తదితరులు

కోదాడరూరల్‌ : వరదలతో నష్టపోయిన బాధితులకు కాంగ్రెస్‌ అండగా ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి విరాళంగా వచ్చిన నిత్యావసర వస్తువులను ఆదివారం మండల పరిధిలోని కూచిపూడి గ్రామంలో బాధితులకు అందజేసి ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి పిలుపుతో అనేక మంది దాతలు ముందుకొచ్చి నిత్యావసర వస్తువులు అందజేశారని తెలిపారు. అదే విధంగా కూచిపూడి, తొగర్రాయిలో వరద బాధితులు, రైతులకు ఇబ్బంది లేకుండా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అధికారులు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు ఇర్ల సీతరాంరెడ్డి, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ రేపూరి వెంకటాచారి, పీఏసీఎస్‌ చైర్మన్‌ ఓ.శ్రీనివాసరెడ్డి, శరభేశ్వరరావు, రెడ్డిపూడి అనంతరామయ్య, శెట్టి పూర్ణచందర్‌రావు, నాంచారయ్య, శ్రీనివాసరావు, తిరపతయ్య, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

పోడు భూములను పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

నేరేడుచర్ల : శ్రమను నమ్ముకొని రెక్కలు ముక్కలు చేసుకుంటూ జీవనం గుడుపుతున్న శ్రమజీవులకు పోడు భూములను పంపిణీ చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని కమ్యూనిస్టుల పోరాటల ఫలితంగా సాధించుకున్నట్లు తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలిలకు వేతనం రూ.600 చెల్లించాలన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రభుత్వ బంజరాయి, పోరంబోకు, భూదాన్‌ భూములు, భూస్వాముల ఆధీనంలో ఉన్న మిగులు భూములను పేదలకు పంచాలన్నారు. సామాజిక భద్రత, మహిళలకు రక్షణ కల్పించాలని, ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు నేరస్తులను కఠినంగా శిక్షించాలన్నారు. ఆయన వెంట సీపీఐ నాయకులు యల్లబోయిన సింహాద్రి, కత్తి శ్రీనివాస్‌రెడ్డి, రావుల సత్యం తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో ముత్యాలమ్మ బోనాలు



బోనాలతో ముత్యాలమ్మకు పూజలు చేస్తున్న గ్రామస్తులు


మఠంపల్లి : మండలంలోని చెన్నాయిపాలెం గ్రామంలో గిరిజనులు ముత్యాలమ్మ జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి ముత్యాలమ్మకు పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. అనంతరం కోళ్లు, మేకపోతులను బలిచ్చి తమ మొక్కులను చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్‌, మాజీ జెడ్పీటీసీ నీలామంజీనాయక్‌, మాజీ సర్పంచ్‌లు భూక్యా నాగునాయక్‌, భూక్యా మారోని, గోవర్ధన్‌నాయక్‌, తులసీరామ్‌నాయక్‌, మాళోతు శ్రీనునాయక్‌, లోకనాధంనాయక్‌, రాహుల్‌నాయక్‌, రవీందర్‌నాయక్‌, ఈశ్వర్‌నాయక్‌, తదితరులు పాల్గొన్నారు.

ఉర్లుగొండ అందాలు చూడతరమా..




గుట్ట గర్భంలో వెలసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవాలయం

మోతె : మండల పరిధిలోని ఉర్లుగొండ ప్రకృతి అందాలు చూపర్లను ఆకట్టుకుంటున్నాయి. పచ్చని పంటపొలాలు, గుబురుగా విస్తరించిన మొక్కలతో కోనసీమ అందాలను తలపిస్తుంది. గ్రామానికి దక్షిణం వైపు ఉన్న గుట్ట గర్భంలో శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయం, ఎతైన తాటివనాలు, వర్షాకాలంలో పచ్చని అందాలను ప్రకృతి వికసింపజేస్తుంది. ఉర్లుగొండ గ్రామానికి ఒక పక్క పాలేరు రిజర్వాయర్‌ మరో పక్క శిఖిరంలాంటి గుట్ట చూపర్లను ఆకట్టుకుంటున్నాయి.



పచ్చని చెట్ల మధ్యన గుట్ట



గుండుపై గుండు



ఉర్లుగొండ పరిధిలోని పచ్చని పొలాలు